క్లుప్తంగా

వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన



సచివాలయానికి వెళ్తున్న విద్యార్థులు

కురిచేడు: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ సంస్థలపై గురువారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం, మీసేవా సంస్థలను విద్యార్థులకు చూపించి అక్కడ ఏయే పనులు చేస్తారు, ఏయే అధికారులు ఉంటారు. ఏయే దరఖాస్తులు స్వీకరిస్తారు, వాటి విధి విధానాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో విద్యార్థులు ఎక్కడకు వెళ్లి ఏం దరఖాస్తు చేసుకోవచ్చనే విషయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు.

అయ్యప్పలకు సద్ది



సద్ది చేస్తున్న అయ్యప్పలు

దొనకొండ: స్థానిక అడ్డ రోడ్డులో వెలసిన శ్రీవిజయాంజనేయ స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు సద్ది, భిక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. చుట్టుపక్కల గ్రామాల అయ్యప్పలంతా రోజూ స్వామి వారికి విశేష పూజలు నిర్వహిస్తూ విజయాంజనేయస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బాల రంగయ్య గురుస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీను, గురవయ్య, నరసింహ, తిరుపతిరావు, ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి పర్యవేక్షణలో స్వాములు ఎంతో భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయ్యప్పలు శబరికి వెళ్లే వరకు అన్నదానం నిత్యం నిర్వహిస్తున్నట్లు బాలిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

దొనకొండ: మండలంలోని 18 పంచాయతీల్లో శుక్రవారం నుంచి గ్రామాల్లో జాతీయ గ్రామీణ హామీ పథకం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. మండలంలోని 18 పంచాయతీలకు 2025–26 సంవత్సరంలో ప్రణాళిక ప్రక్రియలో భాగంగా పనులు గుర్తింపు, లేబర్ బడ్జెట్ తయారీ, గ్రామసభల నిర్వహణ తదితర విషయాలపై సభల్లో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. 29న వద్దిపాడు, తెల్లబాడు, 30న చందవరం, పోలేపల్లి, 02న గంగదేవిపల్లి, పెదన్నపాలెం, 03న మంగినపూడి, ఆరవల్లిపాడు, 04న కొచ్చెర్లకోట, రుద్రసముద్రం, 05న మల్లంపేట, సంగాపురం, 06న పి.వెంకటాపురం, ఇండ్లచెరువు, 07న రామాపురం, లక్ష్మీపురం, భూమనపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తారని, సంబంధిత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సాయిబాబా మందిరంలో పూజలు



అలంకరణలో సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల షిరిడీ సాయి బాబా మందిరంలో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయి బాబాకు పట్టు వస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, ప్రత్యేక హారతులిచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం స్వామిని దర్శించుకున్న భక్తులు, శ్రీశైలం వెళ్లే కాలినడక భక్తుల కోసం ఏర్వ తిరుమలకొండారెడ్డి సొంత నిధులతో అన్నదానం చేశారు.

రేపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. ఐసన్ ఎక్స్‌పీరియన్స్, డీ మార్ట్ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని చెప్పారు. కంపెనీలో ఐసన్ ఎక్స్‌పీరియన్స్ సేల్స్ ప్రాసెస్ (లీడ్ జనరేషన్) తెలుగు బీపీఓ, లోకేషన్ చెన్నై, 50 ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు చదివిన 19 ఏళ్ల నుంచి 29 ఏళ్ల మధ్య వయసు వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ విజయవాడ, ప్రకాశం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ నగేష్, స్కిల్ హబ్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఎస్.రమేష్ 92474 33273, 99499 14337 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ శాఖ అధికారుల అనాసక్తి

- కురిచేడులో భర్తీకాని పోస్టులు
- వచ్చేందుకు ఆసక్తి చూపని అధికారులు
- జాయినైనా వెంటనే సెలవుల్లోకి వెళ్తున్న సిబ్బంది



కురిచేడు విద్యుత్ సబ్‌స్టేషన్

కురిచేడు:

మండల కేంద్రం కురిచేడు విద్యుత్ శాఖ కార్యాలయంలో పనిచేయాలంటే అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో మండలం నుంచి చాలామంది బదిలీపై వెళ్లారు. కానీ వారి స్థానాల్లో చాలామంది ఇక్కడకు రాకపోవడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకరిద్దరు వచ్చినా జాయినై వెంటనే సెలవు పెట్టి వెళ్లి పోవడంతో మండలంలో విద్యుత్ శాఖకు పెద్ద దిక్కు కరువైంది. ఏ అవసరమొచ్చినా ఏడీఈ, డీఈలకు ఫిర్యాదు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలోని కురిచేడు, ఆవులమంద గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో ఆవులమంద విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు వ్యక్తులు విధులు నిర్వహిస్తుంటారు. కురిచేడు సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. మొత్తం మండలంలో విద్యుత్ శాఖలో ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ఏఈ, ఒక సబ్ ఇంజినీరు, లైన్‌మెన్లు 6, అసిస్టెంట్ లైన్‌మెన్లు 3, జూనియర్ లైన్‌మెన్లు 5 పోస్టులు ఉన్నాయి. వాటిల్లో ఏఈ, సబ్ ఇంజినీర్ పోస్టుల్లో జాయినై వెంటనే సెలవు పెట్టి వెళ్లిపోయారు. లైన్‌మెన్ ఒకటి, జూనియర్ లైన్‌మెన్లు 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగతా లైన్‌మెన్‌లు సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తారు. డిస్ట్రిబ్యూషన్‌లో లైన్‌మెన్ లేకపోవడంలో జూనియర్ లైన్‌మెన్‌లపై పని ఒత్తిడి పెరిగింది. పంటలు పండించే సమయం కావడంతో రైతులకు విద్యుత్ అవసరాలు ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయాలను నివారించటం కష్ట సాధ్యంగా మారింది. అంతేగాకుండా ఏదైనా నిర్ణయం తీసుకోవాలన్నా ఏఈ, సబ్ ఇంజినీర్లు ఉండాల్సి ఉంది. కీలకపాత్ర పోషించే ఆ ఇద్దరు లేకపోవడంతో ప్రతి చిన్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి వారి నుంచి సమాచారం వచ్చిన తర్వాతే పనులు చేయాల్సి వస్తోంది. గతంలో ఇంతవరకు ఇలాంటి పరిస్థితి ఏర్పడలేదని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మండలంలో విద్యుత్ శాఖలో పనిచేసేందుకు అధికారులు భయపడుతున్నారని విద్యుత్ శాఖ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, సెలవుపై వెళ్లిన వారి స్థానంలో వేరే వారిని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంపత్‌కుమార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివబసవరాజు, ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సంపత్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని పీవీపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, రహదారి భద్రతపై ఆయన అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు వీటిపై అవగాహన కల్పించాలని కోరారు. అపరిచితుల నుంచి ఫోన్‌లు రావడం, లాటరీ తగిలిందని చెప్పడం, మీకు బహుమతి వచ్చిందని, మీ అకౌంట్ నంబర్ చెప్పండని రావడం, లింక్ ఓపెన్ చేయండి.. మీరు లక్షాధికారులవుతారని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. అంతేగానీ వాటిని ఓపెన్ చేస్తే మోసపోతారని చెప్పారు. మీ ఇంటి కుటుంబ సభ్యులకు ఈ విషయాలు తెలియజేస్తే ఎంతో మంచి జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి రహదారి నియమాలు పాటించాలన్నారు. గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని, క్రమశిక్షణ పాటించకుండా ఉంటే జీవితాలు నాశనం అవుతాయని, తల్లిదండ్రులను బాధపెట్టే పనిచేయవద్దని విద్యార్థులకు సూచించారు. హెచ్‌ఎం వరప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

త్రిపురాంతకం: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శివ బసవరాజు పేర్కొన్నారు. మండలంలోని మేడపి, దూపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చిన్నారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సైబర్ క్రైమ్, రహదారి భద్రత నియమాలుపై అవగాహన అవసరమన్నారు. మొబైల్ ఫోన్‌లను విద్యార్థులు ఎక్కువగా బానిస కావద్దన్నారు. విద్యపై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో లోన్ యాప్‌లను వినియోగించవద్దని సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసకావొద్దన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి



దర్శి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వైపాలెంలో పూలేకు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డిలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి దంపతులు పేద వారికి పాఠశాలలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులుగా విద్యనందించారన్నారు. వారు చేసిన గొప్ప కార్యక్రమాలను నేటికీ పేద ప్రజలు హర్షిస్తున్నారని చెప్పారు. కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, జగన్నాథం మోహన్‌బాబు, సోషల్ మీడియా అధ్యక్షుడు యరమల మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా, నాయకులు వలి, కుందురు నరసింహారెడ్డి, లక్ష్మీరెడ్డి, సుబ్బారెడ్డి, కొడవటి జాన్, గర్నెపూడి సామ్యేల్, శ్రీనివాసరావు, బాలకృష్ణారెడ్డి, కుంటా అచ్చారావు, గోను వెంగళరెడ్డి, సుబ్బారెడ్డి, మజ్జువలి, సన్నీ, ప్రభాకర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రతి విద్యార్థి జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాలలో జ్యోతిరావు పూలేకు ఘన నివాళులర్పించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ పూలే దంపతులు ప్రతి పేద వానికి విద్య ముఖ్యమని భావించి బాలబాలికలకు విద్యనందించిన మహనీయులని చెప్పారు. ఉపాధ్యాయుల బసంతి, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

కురిచేడు: జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా స్థానిక గ్రంథాలయ శాఖా కార్యాలయంలో గురువారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి అంగన్‌వాడీ సూపర్‌వైజరు నాగమణి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన సామాజిక విప్లవోద్యమ పితామహుడు జ్యోతిరావుపూలే అన్నారు. షేక్ షబనా, ఇందిర, గ్రంథపాలకురాలు సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: సంఘసంస్కర్త, మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఎం.సుబ్బారావు, హనుమా నాయక్, హరిబాబు నాయక్, ఈ.శివారెడ్డి, బి.త్రిపురాంతకచారి పాల్గొన్నారు.



దర్శి: పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కురిచేడు: పూలేకు నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు

ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలి



ఆధార్ సీడింగ్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం చేస్తున్న విద్యార్థుల ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ ఇందిర ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో జరుగుతున్న ఆధార్ సీడింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 73 శాతం పూర్తయిందని, మిగిలిన వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల వివరాలు నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులపై వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రోజూ తప్పనిసరిగా విద్యార్థులు శిక్షణ తరగతులకు వచ్చే విధంగా చూడాలన్నారు. నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ నాగమహేశ్వరి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ నాగమహేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై ఎంతో శ్రద్ధ వహించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని తెలిపారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులకు ప్రజ్ఞ, జ్ఞానం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. చదువుకున్న విషయాన్ని మరిచిపోకుండా గుర్తించుకోవచ్చన్నారు. పరిసరాలపై పరిశుభ్రత కలిగి ఉండాలని, కళాశాల ప్రాంగణంలో ముళ్ల చెట్లు, గడ్డి, చెద్దారాలను తొలగించి కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌బాబు, జయసింహ, రమేష్, అతిథి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శశిరేఖమ్మకు ఘన నివాళి



శశిరేఖమ్మకు పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: మహిళలు, చిన్నారుల సమస్యలపై పోరాటం చేసిన మహిళా నాయకురాలు మేకా శశిరేఖమ్మ అని సీపీఐ కార్యదర్శి బి.రామయ్య తెలిపారు. మండలంలోని శ్రీనివాసనగర్ పాఠశాల వద్ద సీపీఐ మహిళా నాయకురాలు శశిరేఖమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన పోరాటాలు వివరించారు. ఈ ప్రాంతంలో ఆమె సేవలను కొనియాడారు. చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశాలాక్షి, రామ్మూర్తి, సుబ్బమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

దర్శి: మండలంలోని చందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ అంజిరెడ్డి తెలిపారు. వీరిలో క్రికెట్‌లో వై.దయాసాగర్, అండర్–14 త్రోబాల్‌లో సాల్మన్‌రాజు, హర్షవర్ధన్, రామ్‌చరణ్, వెంకట్రావు, జస్వంత్, కుమార్‌లు, అండర్–17కు కాటంరాజు, పవన్‌కుమార్, ఏవీఎస్ ప్రసాద్, వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ గురుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎయిడ్స్‌పై ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న అధ్యాపకులు

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై ముగ్గుల పోటీలు గురువారం నిర్వహించారు. ఎయిడ్స్ దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్య హక్కును పరిరక్షించడం ద్వారా కొత్త వ్యాధులు దరిచేరకుండా చూడొచ్చన్నారు. అంటువ్యాధులు తగ్గించడం ద్వారా ఎయిడ్స్ రహిత తరాన్ని సాధించగలమన్నారు. వ్యాధి నివారణ కోసం ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆర్‌ఆర్‌సీ కో ఆర్డినేటర్ వి.సుజాత మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రభుదాస్, అధ్యాపకులు జి.వేణు, షారీలమ్మ, కుమారి, వరలక్ష్మి, రమణ, గురవమ్మ, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారులు



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దారవీడు: మండలంలోని ప్రగళ్లపాడులో జాతీయ నమూనా సర్వేలో భాగంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను జాతీయ నమునా సర్వే, జిల్లా గణాంక అధికారులు గురువారం పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ సాగు చేసిన పంటల వివరాలు, విస్తీర్ణం నమోదు వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు పంట నమోదు చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు క్షేత్రస్థాయిలో అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ క్షేత్ర సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, జిల్లా సహాయ గణాంకాధికారి ప్రసాద్, వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి, సీనియర్ అధికారులు చెంచిరెడ్డి, రామకృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులు ఎక్కొద్దు



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రవికుమార్

దర్శి: గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులు ఎక్కొద్దని ఎంవీఐ రవికుమార్ అన్నారు. మండలంలో పలు గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించకున్న డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశారు. ఆ వాహనాలకు ఫెనాల్టీలు విధించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఒకే గూడ్స్ వాహనంలో పదుల సంఖ్యలో ఎక్కి ప్రయాణించరాదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే మీ ప్రాణాలకు ఎవరు బాధ్యతవహిస్తారని ప్రయాణికులను ప్రశ్నించారు. బస్‌ల్లో ప్రయాణాలు చేయాలని, లేదంటే ఆటోలను ఆశ్రయించాలని వారికి తెలియజేశారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



దొంగలపాలైన ట్రాన్స్‌ఫార్మర్

ముండ్లమూరు (దర్శి): మండలంలోని మారెళ్లలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం రాత్రి చోరీకి గురైంది. రైతు చిరుమామిళ్ల సుబ్బారావుకు చెందిన 25 హార్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఉన్న స్థానం నుంచి పెకిలించి అందులో రాగి తీగను తీసుకుని ఖాళీ డబ్బాలను అక్కడ వదిలేసి వెళ్లారు. రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పొలానికి నీరు పెట్టుకునే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు పాలు కావడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వేరొక ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాల డెయిరీలో తనిఖీలు



ముండ్లమూరు: తనిఖీ చేస్తున్న అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని చంద్రగిరి సమీపం శ్రీరామ్ డెయిరీలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి గరికపాటి ప్రభాకర్‌రావు తనిఖీ చేశారు. తనిఖీల్లో పన్నీరు, నెయ్యి, కోవాలో ఆరు రకాల శాంపిళ్లు తీసుకుని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత దాని ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు. తనిఖీల్లో దర్శి సీఐ రామారావు, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు. **తాళ్లూరు:** మండలంలోని తూర్పుగంగవరంలో ఉన్న తేజ డెయిరీని ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాకర్‌రావు, సీఐ రామారావు గురువారం తనిఖీ చేశారు. డెయిరీలో శాంపిల్స్ సేకరించి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపారు. ఫలితాలు వచ్చిన తర్వాత వచ్చిన ఫలితం ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

తాళ్లూరు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండలంలోని తూర్పు గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ సంజీవరావుతో కలిసి ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం గురించి ఆమె ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం సరిగా వండటం లేదని, ఉడకని గుడ్లు పెడుతున్నారని, దీంతో ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నామని చెప్పారు. ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుంటే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.